# ఆర్థికమంత్రికి ప్రశంసాపత్రం!

సమర్పణ
'ఉమారాణి'

భారత ప్రభుత్వ రూపాయల మంత్రి
వరేణ్యులగు దేశముఖ్ గార్కి-
అమాత్య శేఖరా!

మిమ్మల్ని "రూపాయల మంత్రి" అని ఎందు కన్నానంటే కొంతకాలం రిజర్వుబేంకి గవర్నరుగా వుండి నోట్లమీద దస్కత్‌లు పెట్టేరు- రూపాయినోటు మొదలుకొని నూరు రూపాయిల కాగితంవరకూ ముత్యాల్లాంటి మీ చేవ్రాలుతో మురిసి పోయేయి!

పదవిమారినా లక్ష్మీసేవ మీకు తప్పలేదు! మీరు కొన్ని వేగన్ల నోట్లు అచ్చు వేయించేరు! ఆ అచ్చువేయించిన నోట్లు చెలామణికి అధికారం చెలాయిస్తా రన్నమాట-

మీరు సాక్షాత్తూ లక్ష్మీ ప్రసన్నులండీ, మీరు ఒదిలినా అది ఒదిలిపెట్టలేదు- దేశానికి వెన్నెముక డబ్బు! మంత్రులు విమానాలు కొనాలంటే ధనంకావాలి! మంత్రులు భవనాలు కట్టాలంటే డబ్బుకావాలి! మీదయ చల్లగా ఉండాలిగాని దేశాన్ని తాకట్టు పెట్టైనా డబ్బు తీసుకొచ్చి పదవులు నిలబెట్టుకునే ప్రజ్ఞానిధులు మననాయకులు,

మీకు బిర్లాలూ, దాల్మియాలు గొప్పగొప్ప టీపార్టీలు చేసి చంకీ దండలు వేసి మీఫొటో సంపాదించి వారిఇనప్పెట్టెలకి తగిలించు కుంటారు. ధనకనకాల మార్పిడి అంతా తమ హయాంలోనే వుంటుందిగా!

మనదేశానికి రత్నగర్భ అనేపేరు ఉండేదని తమకు తెలుసు ననుకుంటాను- ఇది పూర్వపు మాట లెండి! అప్పుడు ఆర్థికమంత్రులు వుండే వారుకారు! ప్రస్తుతం రత్నగర్భ అనే టైటిలు పోయింది- కేవలం ఆకలిదిబ్బ! డబ్బూలేదు— అన్నంలేదు!

మీదయ - ఎన్ని రూపాయలైనా వండించ గలరు! రూపాయలంటే విటమిన్లు జీవాధారం కదండీ! జీవాధారమైన రూపాయల రాకపోకలకి మీరు సారథి.

ఇండియా ధనాగారం మీచేతులో వుంది! కాయితంముక్కలే ఔగాక! ఆముక్కలంటేఎంత పలుకుబడి, ఎంత గౌరవం, యెంత సన్మానం! ఆఖరికి ప్రధానమంత్రి ఐపోవాలన్నా విటమిన్ కాగితాలంటే చాలు!

ఒకానొక పత్రికలో "ఆర్థిక మంత్రి"కి బదులుగా "అర్థిక మంత్రి" అనిపడింది. అచ్చు పొరబాటులెండి! కొంపతీసి ఆర్థినాలు పెట్టించేమంత్రి ఎవరి కొత్తగా ఏర్పడిందేమో అనుకున్నాను- తెలుగు పత్రికలవాళ్ళకి నిద్దర జాస్తిలెండి! సరిగ్గా చూడరు! ఏమీ అనుకోకండీ.

★

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Madras
Editor & Published by V. KALIDAS, at 12, Thambu Chetty Street